

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	190	210
సూర్యాపేట	రూ.110	155	177
నల్లగొండ	రూ.107	160	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 17.0

అవనిపై హరివిల్లు



ముగ్గులు తీర్చిదిద్దుతున్న మహిళలు

ఉత్సహంగా 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీలు



కొండ స్వప్నకు ప్రథమ బహుమతి అందజేస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, స్పాన్సర్ రాచమల్ల వినోద్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

రంగు రంగుల రంగవల్లులు కనువిందు చేశాయి.. నింగిలోని చుక్కలు పుడమిని తాకి సప్తవర్ణశోభితంగా ముత్యాల ముగ్గులుగా ఒదిగాయి... సంక్రాంతి పండుగ వారం రోజుల ముందే వచ్చిందా అనే రీతిలో అబ్బురపరిచాయి. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా, సామాజిక అంశాలను మేళవిస్తూ మహిళలు వేసిన చుక్కల ముగ్గులు అలరించాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

జిల్లాలో ఆదివారం భువనగిరిలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" మంత్రముగ్ధుల్ని చేశాయి. వీరభద్ర షాపింగ్ మాల్ సహకారంతో భువనగిరి జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాగృతి కళాశాల ఆవరణకు ఉదయం 9గంటల నుంచే మహిళలు, యువతులు ముగ్గులు వేసేందుకు చేరుకున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రంగులతో వచ్చి పేర్లు నమోదు చేసుకున్నారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన ముగ్గుల పోటీ రెండు గంటల వ్యవధితో 12గంటలకు ముగిసింది. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా, సంక్రాంత్రి పండగ ప్రతిబింబించేలా మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. చుక్కల ముగ్గులు వేసి, పలు రకాల రంగుల అద్ది, నవధాన్యాలను గురుగుల్లో నింపి ముగ్గులను అలంకరించారు. ముగ్గుల్లో భోగిమంటలు రంగరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సేవ్ చైల్డ్‌గర్ల్స్, పర్యావరణ పరిరక్షణ వంటి రకరకాల సామాజిక చైతన్య నినాదాలతో ముగ్గులు తీర్చిదిద్దారు. చేయూత, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను ముగ్గుల్లో చేర్చారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 120మంది మహిళలు వచ్చి ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని చక్కని రంగవల్లులతో మంత్ర ముగ్ధులను చేశారు.



1





ముగ్గులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఇతర అధికారులు, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది



ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, విజేత కొండ స్వప్న

2



ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత ఆదిమూల శైలజ

3



తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత చాగంటి శ్రీలత



రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎఫ్‌టీఎస్‌లు

ఇచ్చేదే సగం..
నెలలుగా పెండింగ్

9 నెలలుగా వేతనాలులేక ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఆందోళన

మిర్యాలగూడ, జనవరి7: చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్‌టీఎస్)కు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎఫ్‌టీఎస్ ఉద్యోగులుగా పరిగణించే ధరణి ఆపరేటర్లకు తొమ్మిది నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మొదట్లో నెలనెలా వేతనాలు చెల్లించి రానురానూ రెండు మూడు నెలలకోసారి ఇస్తూ వచ్చారు. వచ్చేదే సగం, మిగతా సగం కంపెనీలే తీసుకుంటుండగా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఎఫ్‌టీఎస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గత వారం ఫీల్డ్ టెక్నిక్ స్టాఫ్ కలెక్టర్లకు వినతిపత్రం అందజేయడంతోపాటు ఆదివారం హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగా రవీందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి దేశ్యానాయక్‌ను కలిసి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని విన్నవించారు.

రికార్డుల నిర్వహణ కోసం

రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ నిర్వహణకు 2018 మే 23న రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకరిని చొప్పున 584 మంది ఎఫ్‌టీఎస్, వారికి తోడుగా 31 జిల్లాల్లో జిల్లా కోఆర్డినేటర్లతో కలిపి 713 మందిని నియమించేందుకు ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎల్అండ్ఎఫ్ఎస్) అనే కంపెనీ (ప్రస్తుతం టెరాసిస్)కు అవకాశం కల్పించింది. ఈ కంపెనీ సైట్ నిర్వహణతోపాటు వెబ్ డిజైనింగ్ పనులను నిర్వహిస్తూ ఉద్యోగుల నియామక బాధ్యతలను ఈసెంట్రిక్ (ప్రస్తుతం పారాడిగమ్ ఐటీ)అనే మరో కంపెనీకి అప్పగించింది. ఎఫ్‌టీఎస్‌లకు నెలకు రూ.11వేల చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తోంది.

వేతనంలో సగం కోత

ఒక్కో ఎఫ్‌టీఎస్‌కు ప్రభుత్వం 2021 జూన్ వరకు ఐఎల్అండ్ఎఫ్ఎస్ కంపెనీ ద్వారా రూ. 18, 000చెల్లించగా, అదే ఏడాది జూలై నుంచి టెరాసిస్ కంపెనీ ద్వారా రూ.24,000 చెల్లిస్తుండగా, ఒక్కో ఉద్యోగి వేతనం నుంచి నెలకు రూ.5 వేల చొప్పున టెరాసిస్ కంపెనీ కోత విధిస్తోంది. మిగిలిన రూ.19,000 పారాడిగమ్‌ఐటీ కంపెనీ రూ. 3,000 కోత పెడుతోంది. మిగతా రూ.16,000లలో పీఎఫ్, ఈఎస్ఐ పోగా నికరంగా ఒక్కో ఎఫ్‌టీఎస్ ఉద్యోగికి రూ.11,000 వేతనంగా అందుతోంది. కాగా వీటిని తొమ్మిది నెలలుగా సదరు కంపెనీలు చెల్లించకపోవడంతో ఎఫ్‌టీఎస్‌ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. వేతనాల కోసం ఎవరిని అడగాలో తెలియక రాష్ట్రంలోని 713 మంది ఉద్యోగులు తల్లడిల్లుతున్నారు.

వేతనం తక్కువ.. పని ఎక్కువ

వెబ్‌ల్యాండ్ స్థానంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి సైట్‌ను తీసుకొచ్చింది. మండలాల వారీగా రైతులకు ఈ వెబ్‌సైట్ ద్వారా సేవలందించేందుకు ఎఫ్‌టీఎస్ ఉద్యోగులకు నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. ఉదయం 9గంటలకు మండల కార్యాలయంలోకి ఎఫ్‌టీఎస్ ఉద్యోగి అడుగు పెడితే బయటకొచ్చేదెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి రాత్రి 10గంటల వరకు విధులు నిర్వహించాల్సి వచ్చింది. సర్వే నెంబర్ల వారీగా రైతుల వేలిముద్రల సేకరణ, సైట్‌లో వివరాలు పొందుపర్చడం వంటి పనులలో ఎఫ్‌టీఎస్ ఉద్యోగులు తీరిక లేకుండా విధులు నిర్వహించారు. భూముల రిజిస్ట్రేషన్ విధులను ప్రభుత్వం తహసీల్దార్లకు బదిలీ చేయడంతో వీరిపై మరింత పనిభారం, ఒత్తిడి కూడా పెరిగింది. రోజుకు 12గంటలకు పైగా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నా రూ.11,000 వేతనం మాత్రమే అందుతోంది. జీవో 63, 2021 ప్రకారం వేతనాలను రూ.31,000కు పెంచాలని డిమాండ్ చేస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదని వారి వాపోతున్నారు. నల్లగొండ జిల్లాలో 36 మంది, సూర్యాపేట జిల్లాలో 26మంది, యాదాద్రి జిల్లాలో 19మంది, మొత్తం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 81 మంది ధరణి ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. కంపెనీలు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొంది.

డేటా ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలి

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మునిసిపల్ కార్యాలయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, ఆర్డీవో అమరేందర్

భువనగిరి టౌన్, జనవరి 7: 'ప్రజాపాలన'లో వచ్చిన దరఖాస్తుల డేటా ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం భువనగిరి మునిసిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీని ఆయన తనిఖీచేసి మాట్లాడారు. దరఖాస్తుదారులు ఇచ్చిన ప్రతీ వివరాలను నమోదు చేయాలని, ఏ మాత్రం ఏమరపాటు చూపొద్దన్నారు. డేటా ఎంట్రీ వివరాలు లబ్ధిదారుల ఎంపికలో కీలకంగా ఉంటాయన్నారు. డేటా ఎంట్రీలో తలెత్తే సాంకేతిక సమస్యలను అధికారులు వెనువెంటనే పరిష్కరించాలని, సరిపడిన సంఖ్యలో ఆపరేట్లను నియమించాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో అమరేందర్, కమిషనర్ బి.నాగిరెడ్డి, ఉన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ మునిసిపాలిటీ, జనవరి 7: మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీలో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పరిశీలించి, కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో కాంట్రాక్టర్లు దోపిడీకి పాల్పడ్డారని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులకు సాగునీరు అందించేందుకు పిలాయిపల్లి కాల్వను తీసుకువస్తే 10 ఏళ్లుగా కాల్వ నిర్మాణాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందన్నారు. అనంతరం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీచేసి ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ క్లినిక్‌లు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కెమికల్ కంపెనీలు వ్యర్థాల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇండోర్ స్టేడియానికి కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేగా, స్పందించిన ఆయన ఆర్డీవోను పిలిచి సర్వే చేసి స్థలాన్ని రక్షించాలని ఆదేశించారు. అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం చూడాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డి, జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, కౌన్సిలర్స్ కోయ్యడ సైదులు, ఎండి.బాబాషరీఫ్, సందగళ్ల విజయసతీష్, అంజయ్య, బోయ దేవేందర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అలివేలు, ఎక్సైజ్ సీఐ నాగలక్ష్మి, పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్: మండలంలోని ఎస్.లింగోటం, చిన్నకొండూర్ గ్రామాల పరిధిలోని పిలాయిపల్లి కాల్వను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు.

రాష్ట్ర సరిహద్దులో ముమ్మర తనిఖీలు



రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కోదాడ రూరల్, జనవరి 7: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్డు చెక్ పోస్టు వద్ద ఆదివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చే వాహనాలను తెలంగాణ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్నట్లు చెక్‌పోస్ట్ ఇన్‌చార్జి ఎస్‌ఐ మల్లేశ్ తెలిపారు. తెలంగాణలోకి ఆంధ్రప్రదేశ్ నుంచి చెక్‌పోస్టుల మీదుగా హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున గంజాయి సరఫరా అవుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలను ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఎన్ని వాహనాలు తనిఖీ చేశామనే వివరాలు జిల్లా హెడ్‌క్వార్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే తనిఖీలు నిర్వహించిన వాహనాల నెంబర్లను నమోదు చేసుకుంటున్నట్లు వివరించారు.

మహిళ అదృశ్యంపై కేసు



మల్లిక

హుజూర్‌నగర్, జనవరి 7: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బాణోతు మల్లిక అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్‌ఐ జహంగీర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీలో బాణోతు యాకూ, అతని భార్య మల్లికలు నివసిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మల్లిక కనిపించకుండా పోయింది. ఉదయం లేచి చూడగానే ఇంట్లో లేకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితంలేదని భర్త తెలిపాడు. ప్రస్తుతం 16నెలల కుమారుడు ఉన్నాడు. కాగా మల్లిక ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి. ఈ మేరకు భర్త యాకూ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పండుగకు వెళుతుండగా ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి ● కుమారుడికి తీవ్రగాయాలు
- సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో విషాదఛాయలు



సీతమ్మ(ఫైల్)

నేరేడుచర్ల, జనవరి 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన మంత్రిప్రగడ సీతమ్మ(56), ఆమె కుమారుడు సీతారాం(30)తో కలిసి ప్రగతి స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్నారు. నెల్లూరులో నివాసం ఉంటున్న సీతమ్మ కుమార్తె కీర్తి, అల్లుడు సునీల్‌లు సంక్రాంతికి ఆహ్వానించడంతో పిండి వంటలు తీసుకొని శనివారం రాత్రి తిరుపతి వెళ్తున్న మిర్యాలగూడడిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. తెల్లవారుజామున నెల్లూరు జిల్లా గూడూరు మండలం ముంచెర్ల జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు వెనుక సీటులో ఉన్న సీతమ్మ, కుమారుడు సీతారాంలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం సమీపంలోని కావలి ఆస్పత్రికి తరలించగా, సీతమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. సీతారం పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. సీతారాంకు వివాహం కాలేదు. సీతమ్మ భర్త కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందడంతో సీతమ్మ, ఆమె కుమారుడు ఇద్దరు నేరేడుచర్లలో నివాసం ఉంటున్నారు. విషయం తెలియడంతో నేరేడుచర్లలో విషాదచాయలు అలుముకున్నాయి. ఆమె అంత్యక్రియలు నెల్లూరులోని కుమార్తె ఇంటి వద్దే చేయనున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



భాస్కర్(ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి, జనవరి7: ఆర్థిక ఇబ్బందులకు తోడు, మద్యానికి బానిసైన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన భాషిపాక భాస్కర్(45) వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసై ఇంట్లో ఎవరూలేని సమయంలో వరండాలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భాస్కర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు. భాస్కర్ కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వరినాట్లు వేసి వస్తుండగా ఆటో బోల్తా

- 13 మంది కూలీలకు గాయాలు
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ఘటన



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యులు

చిట్యాల రూరల్, జనవరి 7: వరినాట్లు వేసి వస్తున్న ఆటో బోల్తాపడడంతో 13 మంది కూలీలకు గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాంపల్లికి చెందిన మహిళలు, యువతులు వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామశివారులో ఓ రైతు పొలంలో వరినాట్లు వేసి సాయంత్రం ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. గుండ్రాంపల్లి శివారులోని జేబీ వెంచర్ సమీపంలో గల జింకల సర్కిల్ ప్రాంతంలో ఆటో అజాగ్రత్తగా నడపడంతో రోడ్డు పక్కన బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు దివ్య, బత్తుల అండాలు, అనసూయ, అనిత, విజయ, పద్మ, భవాని, అంజమ్మలతో పాటు మరికొంతమందికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు గాయపడిన వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో దివ్య, అండాలుకు తీవ్రగాయాలుకావడంతో హైదరాబాద్ తరలించారు. భవాని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అండర్-14 క్రికెట్‌లో ప్రథమ బహుమతి



క్రీడాకారులను అభినందిస్తున్న డీఈవో నారాయణరెడ్డి

భువనగిరి టౌన్, జనవరి 7: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ టోర్నీలో యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ చూపి ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే ప్రతిభ చూపిన జిల్లాకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, విఘ్నేష్, మణికంఠ, ఆవేజ్ అలీ, రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. ఈమేరకు డీఈవో డాక్టర్ కె.నారాయణరెడ్డి, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ కె.స్టాలిన్‌బాబు, గణేష్, క్రికెట్ అకాడమీ, వ్యవస్థాపకులు ఏవీ గండేశ్వర్‌రావు, కోచ్ వినయ్ సింగ్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ కె.స్టాలిన్, బాబు, తదితరులున్నారు.

అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి

● మూడు ముళ్లతో ఒక్కటైన జంట ● ఆశీర్వదించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జనవరి 7: లండన్ అమ్మాయి.. ఇండియా అబ్బాయి మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహానికి యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణం వేదికైంది. చౌటుప్పల్‌కు చెందిన రైతు, సీపీఐ పట్టణ కార్యదర్శి మోహన్‌రెడ్డి కుమారుడు పగిళ్ల హేమంత్‌రెడ్డి ఉన్నత చదువు నిమిత్తం నాలుగేళ్ల క్రితం లండన్ వెళ్లారు. అక్కడే ఉద్యోగం చేస్తున్న హేమంత్‌రెడ్డికి లండన్‌కు చెందిన యువతి హార్లీతో పరిచయమైంది. ప్రేమించుకున్న వారు వివాహ బంధంతో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. పెద్దల అంగీకారంతో హేమంత్‌రెడ్డి స్వగ్రామంలో తల్లిదండ్రుల ఆశీర్వాదంతో పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ ఆదివారం హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. హార్లీ తరుపున లండన్ నుంచి తమ్ముడు వివాహానికి హాజరయ్యాడు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని నారాయణరావు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పర్యాటక కేంద్రంగా మారేనా?

» గుర్తింపునకు నోచని వాడపల్లి పర్యాటక ప్రాంతం

» రైల్వేస్టేషన్ పునరుద్ధరణపై అస్పష్టత

» అభివృద్ధి చేయాలని దామరచర్లవాసుల విజ్ఞప్తి



వాడపల్లి కృష్ణా, మూసీ సంగమ ప్రదేశం



శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచింది. కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రదేశంలో సుమారు 600 ఏళ్ల క్రితం రెడ్డిరాజుల కాలంలో నిర్మించిన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర, లక్ష్మీనరసింహాస్వామి ఆలయాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. అగస్త్యేశ్వరాలయంలోని శివలింగం పైభాగం నుంచి నిరంతరం ఉద్భవిస్తున్న గంగాజలం, లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్ ఎదురుగా ఉన్న రెండు ప్రమిదల్లో పైభాగంలోని ఉన్న ప్రమిద కదులుతుండగా కింది భాగంలో ఉన్న ప్రమిద నిశ్చలంగా ఉంటుంది. స్వామివారి ఉచ్ఛ్వాస, నిశ్వాస కారణంగా పైన ఉన్న ప్రమిద కదులుతుందని భక్తుల నమ్మకం. ఆలయాలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. కాకతీయుల కాలంలో నిర్మించిన కోటలు, కోట గోడలు, పలు పురాతన ఆలయాలు శిథిలావస్థలో నేటికి దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా ఈ ప్రాంతంలో నిజాం మేనల్లుడు వజీర్ సుల్తాన్ నిర్మించిన ఎన్నో కట్టడాలు ఇక్కడ నెలవై ఉన్నాయి. ప్రధానంగా సంగమ ప్రదేశంలో ఆహ్లాద వాతావరణం ఉంటుంది. ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని గత రెండు దశాబ్దాలుగా పలువురు కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌ను పునరుద్ధరించాలి

పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న మండలకేంద్రంలో రైళ్లు నిలుపదల లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదాయం సమకూరడం లేదనే కారణంతో రెండు దశాబ్దాల క్రితం రైల్వేస్టేషన్‌ను మూసివేశారు. రైల్వేస్టేషన్‌ను తిరిగి పునరుద్ధరిస్తే నిత్యం వందల సంఖ్యలో స్థానికులతోపాటు పరిశ్రమల్లో పనిచేసే వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ప్రయాణించే వీలుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వాడపల్లి సంగమం, శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర, లక్ష్మీనరసింహాస్వామి ఆలయాలతో పాటు పలు సిమెంట్ ఫ్యాక్టరీలతో దామరచర్ల ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న దామరచర్ల మండలంలో పలు సమస్యలు ఏళ్ల తరబడి తిష్టవేసి ఉన్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికంగా గుర్తింపు పొందినా సమస్యలు మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోడం లేదు. మండలంలో సౌకర్యాలు కల్పించి పర్యాటక కేంద్రంగా మార్చడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– దామరచర్ల

రామాలయ నిర్మాణంతో సనాతన ధర్మ పరిరక్షణ

● మాజీ డీఎస్పీ నళిని

భువనగిరి టౌన్, జనవరి 7: అయోధ్యలో రామాలయ నిర్మాణంతో సనాతన ధర్మ పరిరక్షణకు కలిసి వస్తుందని మాజీ డీఎస్పీ దొమకొండ నళిని అన్నారు. విశ్వహిందూ పరిషత్ బృందం ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఆమెను కలిసి అయోధ్య రాముడి అక్షింతలు, ఆలయ ప్రారంభోత్సవం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ హిందువు అయోధ్య ఆలయాన్ని సందర్శించాలన్నారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో భక్తుల సందడి

● స్వామి ధర్మదర్శనాలకు 3గంటలు..ప్రత్యేక దర్శనాలకు గంట సమయం ● ఏకాదశి లక్షపుష్పార్చనలు..తిరుప్పావై వ్రతారాధనలు ● స్వామికి పూల బుట్ట బహూకరణ



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ, లక్ష పుష్పార్చనలు పూజలు నిర్వహించిన అర్చకులు



యాదగిరిగుట్ట, జనవరి7: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కొండగుహలో కొలువైన స్వయంభువుల దర్శనాలు.. ఆర్జిత సేవల నిర్వహణకోసం వారాంతపు సెలవురోజు కావడంతో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన భక్తులు ఇష్టదైవాల నామస్మరణలతో ప్రధానాలయం, తిరువీధులు మారుమోగాయి. స్వామి వారి ధర్మదర్శనాలకు మూడు గంటలు, ప్రత్యేక దర్శనాలకు గంట సమయం పట్టిందని, సుమారు 30వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. దేవదేవుడి దర్శనాలకోసం విచ్చేసిన భక్తులతో కొండకింద కల్యాణ కట్ట, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్‌లు.. కొండపైన ఆలయ తిరువీధులు, దర్శన క్యూలైన్లు, ప్రధానాలయం, ప్రసాదాల విక్రయశాల తదితర ప్రాంతాలు కోలాహలంగా కనిపించాయి. దర్శనానంతరం ప్రధానాలయ తిరువీధుల్లో, ఘాట్‌రోడ్, పుష్కరిణి, వ్రత మండపం వద్ద గల గ్రీనరీ, పెద్దగుట్టపైన, రాయిగిరి చెరువు ప్రాంతంలోని గార్డెన్‌లలో భక్తులు సేదతీరారు. అనుబంధ పాతగుట్టలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.43,61,283 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు తెలిపారు.

ఏకాదశి లక్షపుష్పార్చనలు..

యాదగిరీశుడి సన్నిధిలో ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్షపుష్పార్చన పూజలు, తిరుప్పావై వ్రతారాధనలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. సుప్రభాతం, బిందెతీర్థంతో నిత్యపూజలు ఆరంభించిన అర్చకులు గర్భగుడిలోని స్వయంభువులకు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేద మంత్ర పఠనాలతో అభిషేకించి అర్చించారు. ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు స్వర్ణసింహాసనంపై అధిష్ఠింపజేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్ల సహస్రనామాలతో లక్షపుష్పార్చన పూజలు చేశారు. ముందుగా ప్రభాతవేళ ఉత్తరదిశలోని మొదటి ప్రాకార మండపంలో తిరుప్పావై పాశుర పఠనాలతో ధనుర్మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్యతిరుకల్యాణోత్సవాలను ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి, మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం, సత్యనారాయణస్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. యాదగిరీశుడికి సుమారు కిలో వెండితో తయారు చేసిన పూలబుట్టను ఆదివారం హైదరాబాద్ ఒమేగా హాస్పటల్ ప్రతినిధి టి శ్రీకాంతారావు బహూకరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు డి.సురేందర్‌రెడ్డి, ఉపప్రధానార్చకులు కొడకండ్ల మాధవాచార్యులు తదితరులున్నారు.

స్వామివారి సేవలో ప్రముఖులు

యాదగిరీశుడిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. స్వామిని కర్ణాటక రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి తరుణ ప్రకాష్ రుద్రప్ప పాటిల్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్ రెడ్డిలు వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రధానాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొన్నారు. పూజలనంతరం అర్చకులు వీరికి ఆశీర్వచనం నిర్వహించగా.. దేవస్థాన అధికారులు స్వామివారి అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

కృష్ణా బ్యాక్ వాటర్‌పై దృష్టి పెట్టాలి

● ఆయకట్టు చివరి భూములకు నీరందించాలి ● లిఫ్టుల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

● అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు ● అధికారులతో సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, జనవరి 7: కృష్ణా నది బ్యాక్ వాటర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో హుజూర్‌నగర్ ప్రాంతంలోని నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలపై అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కృష్ణా పరివాహక ప్రాంతం ఉన్నందున హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అవసరమైన కృష్ణానీటిని ఉపయోగించుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. లిఫ్టుల నిర్మాణం, కాల్వ చివరి భూములకు నీరందించడం కోసం చెరువులను డిజైన్ చేయాలన్నారు. కృష్ణా నీటి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో నీటిని ఉపయోగించుకునేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 34 లిఫ్టులు, కోదాడలోని లిఫ్టులను పునరుద్ధరించాలన్నారు. రెండు లిఫ్టులకు కలిపి ఒక అధికారిని కన్వీనర్‌గా నియమించాలని ఆదేశాలు జారీచేశారు. లిఫ్టుల నిర్వహణలో ఎంతో కీలకంగా వ్యవహరించాలన్నారు. మహంకాళిగూడెం, నక్కగూడెం, దొండపాడు, అమరవరం, మేడారం, తుమ్మల తండా తదితర లిఫ్టులన్నీ పరిశీలించాలన్నారు. రామచంద్రాపురం, పెదవీడు లిఫ్టులు నడవడం లేదని, మినీ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదని, బ్యాటరీలు అలంకార ప్రాయంగా మారాయన్నారు. వాటిని అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. వేములూరు ప్రాజెక్ట్ ఆధునీకరణకు రూ.9కోట్లు మంజూరు చేసినా పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని సమావేశంలో రైతులు వెల్లడించారు. చెన్నాయిపాలెం దాకా నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. ఆయకట్టు చివరి భూములకు నీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు అధికారులు అందుబాటులో ఉండి పనులు పూర్తిచేయాలన్నారు. ఎన్నెస్పీ కాల్వలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. చెరువులు, కుంటలు, నీటిబంధాలు, జాలు కాల్వలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సీఈ రమేష్‌బాబు, ఈఈ శ్రీనివాసరావు, స్వామి, భిక్షం, తుమ్మల శ్రీనివాస్, పవన్‌కుమార్, ఈఈ వెంకటయ్య, డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సాముల శివారెడ్డి, తన్నీరు మల్లికార్జున్‌రావు, గెల్లి రవి, భూక్యా గోపాల్, మంజూనాయక్, కొట్టె పద్మసైదేశ్వరరావు, దొంగరి వెంకటేశ్వర్లు, పెండెం సుజాతశ్రీను, గోవిందరెడ్డి, రాపోలు నర్సయ్య, మోతీలాల్, కొణతం వెంకటరెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, సింగారపు సైదులు, వీరారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను కాపాడాలని వినతి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌తోపాటు శ్రీశైలం, జూరాల, కోయిల్‌సాగర్ వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టులను కాపాడాలని తెలంగాణ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్‌రావు, ఇంజనీరింగ్ విభాగం మెయింటనెన్స్ ప్రాజెక్ట్ ఎంప్లాయీస్ ప్రధాన కార్యదర్శి వెంకట్ ఆదివారం మంత్రి ఉత్తమ్‌కు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుల్లో రెండు దశాబ్దాలుగా ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో సిబ్బంది కొరత ఉందని, దీంతో ప్రాజెక్టుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టులకు సిబ్బందిని నియమిస్తామని హామీలు ఇచ్చిన గత ప్రభుత్వాలు నియమించలేదని తెలిపారు. నీటి పారుదల శాఖ విభాగంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో నీరు వృథా అవుతుందన్నారు. స్పందించిన మంత్రి ఈఎన్‌సీతో మాట్లాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

భువనగిరిలో రంగుల హరివిల్లు

ముగ్గులతో

సృజనాత్మకత వెలుగులోకి

● అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

యాదాద్రి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలతో మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తోందని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ముత్యాల ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక బాధ్యతగా 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' సంస్కృతి సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు వేసిన రంగురంగుల పరిశీలించి అభినందించారు. భువనగిరి ఆర్డీవో అమరేందర్ మాట్లాడుతూ 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' సామాజిక బాధ్యతగా ముగ్గుల పోటీలు నిర్వహించడం శుభప్రదమన్నారు. పాశ్చాత్య పోకడలతో కనుమరుగవుతున్న సంస్కృతిని, సంప్రదాయాలను ముత్యాల ముగ్గుల పోటీలతో 'ఆంధ్రజ్యోతి' పునర్జీవం చేస్తోందన్నారు. భువనగిరి మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో చిన్న, పెద్ద తేడాలేకుండా మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం శుభపరిణామన్నారు. జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి ముగ్గుల పోటీలను 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' నిర్వహించడం శుభకరమని, ఈ పోటీలకు ఏటా ఆదరణ పెరుగుతోందన్నారు. వీరభద్ర షాపింగ్ మాల్ యజమాని, స్పాన్సర్ రాచమల్ల వినోద్ మాట్లాడుతూ 'ఏబీఎన్, ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీకి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. గతం కంటే అధిక సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొనడమే దీనికి నిదర్శనమన్నారు. భువనగిరికి చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు కన్సులేషన్ బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు వీఎస్. మీరా, శిరీష, నిర్మల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీవో ఎస్.అమరేందర్, భువనగిరి మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సూర్యనారాయణరెడ్డి, స్పాన్సర్ రాచమల్లు వినోద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి కొండ స్వప్న(ఆలేరు)కి రూ.6వేల విలువ గల పట్టుచీర, ద్వితీయ బహుమతి ఆదిమూలం శైలజ(చిట్యాల)కు రూ.4వేల విలువైన పట్టుచీర, తృతీయ బహుమతి చాగంటి శ్రీలత (భువన గిరి) అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ మరాఠి రవి, ఫొటోగ్రాఫర్ గంధమల్ల రాజు, వీడియో జర్నలిస్టు మహేష్, ఆంధ్రజ్యోతి విలేకరులు కె. నర్సిరెడ్డి, పి. నర్సింహ, పీఎస్ కరుణాకర్, తాళ్ల భాస్కర్, డి. శ్రీనివాస్, సురపంగ శ్రీనివాస్, ఏబీఎన్ రిపోర్టర్ గుండేటి హరిబాబు, యాడ్ రిప్రజెంటివ్ సీహెచ్. అయోధ్య, ఏసీవో నాగరాజు పాల్గొన్నారు.


ముగ్గు వేసేందుకు సిద్ధమవుతూ..


ముగ్గులు వేస్తున్న మహిళలు


ముగ్గు వేస్తున్న చిన్నారి


భువనగిరిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు


ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఆదిమూల శైలజ


తృతీయ బహుమతి అందుకుంటున్న చాగంటి శ్రీలత


పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళలు


మహిళ వేసిన ముగ్గు


ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన మహిళలు


మాట్లాడుతున్న ఆర్డీవో అమరేందర్


మాట్లాడుతున్న కమిషనర్ నాగిరెడ్డి


మాట్లాడుతున్న జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణరెడ్డి


మాట్లాడుతున్న స్పాన్సర్ రాచమల్ల వినోద్


మహిళ వేసిన ముగ్గు

పార్టీ నిర్మాణంలో సభ్యులు క్రీయాశీలకం

వలిగొండ, జనవరి 7: పార్టీ నిర్మాణంలో సభ్యుల పాత్ర క్రీయాశీలకమని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. యువజన, విద్యార్థి, మహిళలను పార్టీలోకి కొత్త క్యాడర్‌ను ఆహ్వానించాలని సభ్యులుగా చేర్చుకోవడానికి కృషి చేయాలన్నారు. మూసీ ప్రక్షాళన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అన్ని రాజకీయ పార్టీలు ఆందోళన ద్వారా కృషిచేసినప్పటికీ ప్రక్షాళన పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పోలెపాక యాదయ్య, నాయకులు బొడిగె సుదర్శన్, రవీందర్, వెంకటేష్, మహేష్, జాను పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

సంస్థాన్ నారాయణపురం జనవరి 7: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎంపీపీ గుత్తా ఉమాదేవిప్రేమ్‌చందర్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. క్రీడలు శరీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, ముద్దంగుల నరసింహ, ఉప్పల లింగస్వామి, నిర్వాహకులు ఉప్పల నాగరాజు, ఏపూరి సతీష్, మందుగుల బాలకృష్ణ, కొన్‌రెడ్డి నరసింహ, కరెంటోత్ బిక్షపతినాయక్, కుక్కల నరసింహ, ప్రముఖరెడ్డి ఉన్నారు.

రాచకొండలో దేవాలయాలను అభివృద్ధి చేయాలి

సంస్థాన్ నారాయణపురం జనవరి 7: రాచకొండ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలని రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్ కోరారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాచకొండ గుట్టలో ఉన్న ప్రాచీన శివాలయాన్ని పునర్నిర్మాణం చేసి మరింత అభివృద్ధి చేయాలన్నారు. ఈనెల 21న అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సూరపల్లి వెంకటేష్, నిమ్మల నాగేష్, వెంకటేశం, జక్కిడి మధు, అంజిరెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

మోత్కూరు, జనవరి 7: చౌటుప్పల్‌లో ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి కోరారు. మోత్కూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలపై సమీక్ష, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించకోవడం, పార్టీ నిర్మాణం మెరుగు పర్చేలా శిక్షణనిస్తారన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మెతుకు అంజయ్య ఉన్నారు.

తోటి వారిపై అభిమానం చూపించడమే దైవత్వం

ఆలేరు రూరల్, జనవరి 7: ప్రజలను ప్రేమించడంలోనే దైవత్వం దాగుందని జగద్గురు శ్రీ రంబాపురి వీరసింహ సన్నిదీశ్వర్ జగద్గురు ప్రసన్న రేణుక వీరేశ్వర శివాచార్యులు అన్నారు. మండలంలోని కొలనుపాకలో జగద్గురు రంభాపురి వీరసింహ సన్నిదీశ్వర్ జగద్గురు ప్రసన్న రేణుక వీరేశ్వర శివాచార్యులు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కర్నాటక రాష్ట్ర మంత్రులు డాక్టర్ శరణ్ ప్రకాశ్‌పాటి రుద్రప్ప, ఎస్ఎస్ బోసు రాజు, ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఒకరినొకరు గౌరవించుకుంటూ ప్రగతికి మార్గాలేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్, సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అడ్డగూడూరు, జనవరి 7: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అభయ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్ హాస్పిటల్ ఎండి. గోలి వేణురెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ, కంటీపరీక్షలతో పాటు ఈసీజీ తీసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బలెంల త్రివేణి, ఎంపీటీసీ పెండ్యాల భారతమ్మ, మాజీ సర్పంచ్ గోలి రాంరెడ్డి, గూడెం పాండు, కడారి రమేష్, మల్లేష్ ఉన్నారు.

ప్రయాణ సౌకర్యం కోసమే ర్యాంపుల నిర్మాణం

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 7: యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీనగర్ నుంచి యాదగిరిపల్లి వరకు ఉన్న పెద్ద రోడ్డు నుంచి ప్రజల ప్రయాణానికి సౌకర్యంగా ఉండేందుకు ర్యాంపుల నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ర్యాంపుల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రోడ్డు నిర్మించడంతో స్థానికులు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు ర్యాంపుల నిర్మాణంతో గాంధీనగర్, యాదగిరిపల్లి, బీసీకాలనీ, వంగపల్లి, మల్లాపురం వెళ్లే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా ర్యాంపులతో రోడ్డు దిగి వెళ్లేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. యాదగిరిగుట్టలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని. అనంతరం యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన కొత్త నిర్మాణ వ్యాపార సముదాయాలను పరిశీలించారు. గాంధీనగర్ నుంచి యాదగిరిపల్లి వరకు గుంతలమయమైన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు కౌన్సిలర్ గౌళీకార్ అరుణా రాజేష్, స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, వైస్ ఛైర్మన్ కాటం రాజు, కౌన్సిలర్లు గౌళీకార్ అరుణారాజేష్, సీస విజయలక్ష్మి కృష్ణ, ముక్కెర్ల మల్లేశ్, బిట్టు హరీష్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగుబాల్‌రాజ్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న విప్ బీర్ల అయిలయ్య

12 నుంచి సంక్రాంతి సంబురాలు


సభా స్థలిని పరిశీలిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి

భువనగిరి టౌన్, జనవరి 7: సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే లక్ష్యంతోనే సంక్రాంతి సంబురాలు, జిల్లాస్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. భువనగిరిలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతి 12 నుంచి 14 వరకు భువనగిరిలో జిల్లాస్థాయి గ్రామీణ క్రీడలు, సంబురాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోమారి సుధాకర్‌రెడ్డి, ఎండీ అజీమొద్దిన్, అందె శంఖర్, నాయకులు పట్నం కమలాకర్, బద్దం భాస్కర్‌రెడ్డి, రాములు, బాషబోయిన రాజేశ్ పాల్గొన్నారు.

దండోరా ఉద్యమ కేంద్రాలుగా గ్రామాలు



సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్ నరేష్

భువనగిరి టౌన్, జనవరి7: ఎస్సీ వర్గీకరణ సాధనకు గ్రామాలు దండోరా ఉద్యమ కేంద్రాలుగా వ్యవహరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. మాదిగల ఉప కులాల హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్న ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కిందన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు ఇటుకల దేవేందర్, రాగాల ఉపేందర్, దుబ్బ రామకృష్ణ, నాయకులు నర్లా చంద్ర స్వామి, కొళ్ళూరు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

మోత్కూరు, జనవరి 7: రాష్ట్రంలో ఉన్న 350 చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని చేనేత కార్మిక సంఘం, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు హైదరాబాద్‌లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత సహకార సంఘాలకు ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు గడిచినా ఎన్నికలు నిర్వహించలేదన్నారు. దీంతో సహకార వ్యవస్థ కుంటుపడిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టెస్కోకు పాలకవర్గం లేక సంఘాలలోని కార్మికులకు ఉపాధి కల్పించలేక పోతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడం లేదన్నారు. సంఘాలు వస్త్రాలు ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చి, ఆ వస్త్రాలను కొనుగోలు చేయకపోవడంతో సహకార సంఘాలు క్యాష్, క్రెడిట్ ద్వారా తెచ్చిన రుణాల వడ్డీలు పెరిగిపోయి అవి నష్టాల ఊబిలో కూరుక పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి గంజి మురళి ఉన్నారు.


మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

బొమ్మలరామారం, జనవరి 7: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పీఏసీఎస్ ఛైర్మన్ గూదె బాల నర్సింహ అన్నారు. మండలంలోని యావాపూర్ తండాలో యావాపూర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొలగొని వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ అరుణ శ్రీనివాస్‌నాయక్, ఎంపీటీసీ హరినాయక్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 7: స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఉద్య మాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మంగ నర్సింహులు అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. యాదగిరి గుట్ట పట్టణంలో సమస్యలు పేరుకుపోయాయన్నారు. యాదాద్రి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సౌకర్యాలు సరిగా లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో చౌటుప్పల్‌లో జరిగే పార్టీ రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఎస్‌కే లతీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్‌రెడ్డి, నాయకులు ఎస్‌కే ఉస్మాన్ షరీఫ్, నల్ల మల్లయ్య, బండిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, దుడుక నాగమణి పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరవొద్దు

మోత్కూరు, జనవరి 7: ప్రజల కోసం పనిచేసిన అమరుల త్యాగాలు మరవొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు దడిపెల్లి లచ్చయ్య మృతిచెందగా ఆదివారం ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. లచ్చయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, నాయకులు బొల్లు యాదగిరి, సిర్పంగి స్వామి, గుండు వెంకటనర్సు, దడిపెల్లి ప్రభాకర్, పిట్టల చంద్రయ్య, సుదర్శన్ ఉన్నారు.

జిల్లాస్థాయి బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

భువనగిరి టౌన్, జనవరి 7: జిల్లాస్థాయి టైగర్స్ కుంగ్‌ఫూ బెల్ట్ గ్రేడింగ్ పోటీలు ఆదివారం భువనగిరిలో నిర్వహించారు. బెల్టుల కోసం పోటీ పడిన విద్యార్థుల కరాటే ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఎండీఅవేజ్ చిస్తీ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ కుంగ్‌ఫూతో ఆత్మ రక్షణ సాధ్యమన్నారు. ప్రతిభ చూపిన వారికి టైగర్స్ కుంగ్‌ఫూ అకాడమీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధులు బాజి లింగం, జటంగి సందీప్, బుగ్గా సాయినాథ్, సందెల విజయ్, కంసాని నవీన్, గజ్జి శ్రీకర్, కొమ్ము హరిబాబు, పుట్ట శ్రీనాథ్ ఉన్నారు.

'గొల్లకురుమలకు గొర్రెలు పంపిణీ చేయాలి'

భువనగిరి రూరల్, జనవరి 7: డీడీలు చెల్లించిన గొల్లకురుమలకు వెంటనే గొర్రెల పంపిణీ చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. భువనగిరిలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80వేల మంది గొల్లకురుమలు నివసిస్తుండగా జిల్లాలో 342 మంది ఉన్నారని తెలిపారు. ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున రూ.1,49,62,500 రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేసి సబ్సిడీ గొర్రెల కోసం ఎదురు చూస్తున్నప్పటికీ ఇప్పటి వరకు పంపిణీ చేయలేదన్నారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, బండారు నర్సింహ, శ్రీశైలం, సత్యనారాయణ, బాలకృష్ణ, చిరంజీవి, వెంకటేశ్ ఉన్నారు.

ఫిషరీస్ సొసైటీ జిల్లా కన్వీనర్‌గా మత్స్యగిరి

మోత్కూరు, జనవరి 7: మత్స్య పారిశ్రామిక సొసైటీ జిల్లా కన్వీనర్‌గా కోమటి మత్స్యగిరి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని రెడ్‌హిల్స్‌లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సొసైటీ ఆవిర్భావసభలో వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు మత్స్యగిరి కృతజ్ఞతలు తెలిపారు.



చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడిగా చింత కింది అంజయ్యను ఎన్నుకున్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా చెవగోని వెంకటేశం, ఊడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తొర్పునూరి వెంకటేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బత్తుల శ్రీశైలం, సహాయ కార్యద ర్శులుగా సత్యనారాయణ, టి. బాబు, ప్రచార కార్యదర్శిగా ఊడుగు మల్లేశ్, కార్యదర్శులుగా వి. మహేందర్, చెరుకు లింగస్వామి ఎన్నికయ్యారు.

మోత్కూరు: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు ఆదివారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్‌లో గుండెపోటుతో మృతిచెందారు. సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మోత్కూరులో ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు మహేశ్వరం వెంకటేశ్వర్లు, పోచం బిక్షపతి, గంగుల రాములు, పోచం కన్నయ్య, గుండు ప్రసాద్, నల్ల యాదగిరి, రేగోటి ఉషారాణి, పసునూరి జ్యోతి, నామాల అరుణ, వేముల నారాయణ, జిల్లా రవీందర్, పెండెం రాజారాం తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: దళితబంధు పథకంలో గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఆదుకోవాలని దళిత బంధు లబ్ధిదారులు కూరెల్ల భాష, వేముల సునీల్, కూరెల్ల రమేష్, సురేష్, బందెల శ్రీను, కూరెల్ల యాదమ్మ కోరారు. ఆదివారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. అడ్డగూడూరు, మోత్కూరు మండలాల్లోని పలు గ్రామాల నుంచి దళితబంధు లబ్ధిదారులను ఎంపిక చేశారని, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల నుంచి అన్ని రకాల

సంక్షిప్త సమాచారం..

కాగితాలు తీసుకుని, పరిశీలించి లబ్ధిదారులుగా ఎంపిక చేసి దళితబంధు పోర్టల్‌లో పేర్లు కూడా నమోదు చేశారన్నారు. బ్యాంకుల్లో జీరో అకౌంటు తీయించగా ప్రభుత్వం రూ.మూడు లక్షల చొప్పున జమ చేసిందన్నారు.

భువనగిరి రూరల్: రాయిగిరిలో నిర్మించనున్న క్రీడా ప్రాంగణానికి రావి నారాయణరెడ్డి పేరు పెట్టాలని రావి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ కోరారు. మండలంలోని బొల్లెపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రావి నారాయణరెడ్డి విగ్రహాలను రావి స్వగ్రామమైన బొల్లేపల్లిలో, భువనగిరి జిల్లా కేంద్రంలో, హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద నెలకొల్పాలని కోరుతూ ఈ నెల 27న బొల్లెపల్లి నుంచి కలెక్టరేట్ వరకు సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు.

గుండాల: మండలంలోని వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి సింధు బీబీనగర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించి గోల్డ్‌మెడల్ అందజేశారు.

వలిగొండ: హైదరాబాద్ రవీంద్రభారతిలో శనివారం రాత్రి జరిగిన కవి సమ్మేళనంలో మండలకేంద్రానికి చెందిన పారుపల్లి నర్సింహకు అఖిలభారత పద్మశాలి సంఘం నాయకులు సాహిత్య పద్మ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు హన్మంతారావు, కవులు నర్సింగ్‌రావు, సుజాత, దేవి, విజయలక్ష్మీ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వలిగొండ: నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ బాతరాజు ఉమా బాలనర్సింహ, కాంగ్రెస్ నాయకులు గరిసె రవి, షైసోళ్ల లక్ష్మీనర్సింహ, ఎలిమినేటి సత్యనారాయణ, యాదగిరి, వెంకటేష్, నర్సింహ, ప్రసాద్, ప్రవీణ్, నరేష్, వినయ్ తదిరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండల పరిధిలోని మల్లాపురం గ్రామంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రె వెంకటయ్య, ఉప సర్పంచ్ పల్లెపాటి మాధవ్, నేతలు కర్రె బీరు మల్లయ్య, జిన్నా బాలరాజు ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్: మండలంలోని ధర్మాజీగూడెంలో అయోధ్య రామాలయ అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొంతం రామకృష్ణారెడ్డి, పకీర్ శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం రవీందర్, కొంతం కృష్ణారెడ్డి, వట్టి పెద్దులు, నర్సింహాచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో అయోధ్య రామ చంద్రుడి అక్షింతలను ఇంటింటికి వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. బాలరాముడిని అర్చించిన ఈ అక్షింతల ప్రాముఖ్యతను ప్రజలకు పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల లలితా శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, శ్రీరాములు, కృష్ణ, శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ఆలేరులో 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కు విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్ హరగోపాల్, బాబురావు, హన్మంత్‌రెడ్డి, కొరుటూరి ఉపేందర్, రమా దేవి, విద్యార్థులు కూళ్ల సిద్దులు, శ్రీనివాస్, బాలరాజు, ప్రవీణ్, సాగర్, శ్రీనివాస్, కృష్ణ, బాబు, కుమార్, మహేందర్, ప్రశాంత్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.